క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం

బిక్కవోలు: మెళ్లూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందించేందుకు ఓ దాత విరాళం అందించారు. పాఠశాల హెచ్‌ఎం బీవీఎల్‌ఎస్ మూర్తి మాట్లాడుతూ కర్ణాటక యూనివర్సిటీలో సైకాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి.ఆశీర్వాదం రూ. 5 వేలు అందించారన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు



మెళ్లూరులో ఆంజనేయస్వామి వారు

బిక్కవోలు: మెళ్లూరులోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదో రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి 62 మంది దంపతులు పంచామృతాలతో అభిషేకాలు చేశారని కమిటీ కన్వీనర్ దూలం నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు



కోటపాడులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న లబ్ధిదారులు

రంగంపేట: కోటపాడు గ్రామ జగనన్న కాలనీలో ఆదివారం లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో సుమారు 15 మంది స్థలాలు పొందిన లబ్ధిదారులు సామూహిక శంకుస్థాపనలు చేశారు. ఎప్పటి నుంచో సొంతిల్లు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ముఖ్యమంత్రి జగనన్న స్థలాలు అందించడంతో ఇల్లు కట్టుకుంటున్నామని వారు ఆనందం వ్యక్తం చేశారు. సొంతింటి కల నెరవేర్చిన జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గవరసాని రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

15 గోవుల దత్తత



గోవులను రైతులకు దత్తత ఇస్తున్న వెంకటలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివశక్తి పీఠం ఆధ్వర్యంలో ఆదివారం 15 గోవులను రైతులకు దత్తత ఇచ్చారు. పీఠం వ్యవస్థాపకుడు బత్తుల బలరామకృష్ణ, ఆయన భార్య వెంకటలక్ష్మి చేతుల మీదుగా వాటిని రైతులకు అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ గోసంరక్షణ పథకంలో భాగంగా గోవులను పెంచడం, వాటిని పూజించడం జరుగుతోందన్నారు. ప్రతి సంవత్సరం పాడి పశువులను రైతులకు పెంపకం నిమిత్తం ఇవ్వడం సంతృప్తికరంగా ఉందన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

సీతానగరం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, కో కన్వీనర్లుగా పలువురిని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిందని రాజానగరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ మాకిరెడ్డి దివ్యసాయి కల్యాణ్‌బాబు ఆదివారం తెలిపారు. మండల కన్వీనర్‌గా సత్యం ప్రవీణ్ (ఇనుగంటివారిపేట), కో కన్వీనర్లుగా ఈతకోట వెంకట్ (ముగ్గళ్ల), సబ్బితి గంగరాజు (రాపాక), కొల్లి చిరంజీవి (మునికూడలి), సోడసాని బాలు (ముగ్గళ్ల), సుధా చరణ్ (రాపాక)ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పడాల

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్, రచయిత, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ఎన్నికయ్యారు. ఆదివారం తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ మహాసభలలో 2023–2025 సంవత్సరానికి గాను జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలలో పడాల వీరభద్రరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పడాల వీరభద్రరావు మాట్లాడుతూ త్వరలో తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మహాసభలను నిర్వహిస్తామని ప్రకటించారు.

బడికి డుమ్మా.. కుదరదమ్మా..

- విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ
- రోజూ స్కూల్‌కు వెళ్లేలా మొబైల్ మెసేజ్ అలర్ట్



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

బిక్కవోలు: పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. దీనికోసం ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులంతా రోజూ బడికి వెళ్లే విధంగా మొబైల్ అలెర్ట్ సందేశానికి రూపకల్పన చేసింది. తద్వారా క్రమశిక్షణను అలవర్చుతోంది. అనపర్తి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పది వరకూ 25 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యార్థులంతా వంద శాతం హాజరై తద్వారా ప్రభుత్వం అందజేస్తున్న అమ్మ ఒడి పథకాన్ని అందుకోవాలనే ఉద్దేశంతో ఈ విధానానికి రూపకల్పన చేశారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ మొబైల్ అలెర్ట్ సందేశం విద్యార్థుల తల్లిదండ్రులకు వెళ్తోంది. ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

10.30 గంటలైనా రాకపోతే..

విద్యార్థులు ఉదయం 10.30 గంటలలోపు పాఠశాలకు హాజరు కాకపోతే.. మీ అమ్మాయి లేక అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్ సందేశం చేరవేస్తారు. దీనికోసం ముందుగా విద్యార్థుల తల్లి, తండ్రి, సంరక్షుని మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరించి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇలాంటి సందేశాలు ఇప్పటి వరకూ కేవలం ప్రైవేట్ పాఠశాలల్లోనే చూశాం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అమలు చేశారు. వరుసగా మూడు రోజుల పాటు పాఠశాలకు హాజరు కాకపోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత గ్రామ వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరవేస్తారు. దీంతో వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్, హెచ్‌ఎంతో కలసి విద్యార్థి ఇంటికి వెళ్లి విద్యార్థి పాఠశాలకు ఎందుకు రావడం లేదనే విషయాన్ని తెలుసుకోవాలి.



విద్యార్థుల హాజరు చూపే యాప్ నమూనా

ఇది మంచి విధానం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీనివల్ల పాఠశాలల్లో వంద శాతం హాజరు అమలవుతోంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తుంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం.

–గొలుగూరి నాగిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పందలపాక ఉన్నత పాఠశాల

పూర్తి స్థాయిలో హాజరుకు..



ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తుంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రులకు సందేశం వెళ్లే కొత్త విధానం తీసుకువచ్చింది. దీనివల్ల పాఠశాలలో రోజూ హాజరు శాతం మెరుగవుతుంది. విద్యార్థులు పాఠశాలలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తుంది.

–శ్రీనివాస్, ఎంఈఓ, బిక్కవోలు, రంగంపేట

విద్యపై శ్రద్ధతోనే..



మా పిల్లలు ఏదైనా కారణంతో స్కూల్‌కు వెళ్లకపోతే ప్రతి రోజూ మెసేజ్ వస్తున్నాయి. వరుసగా రెండో రోజు వెళ్ల లేదా వలంటీర్లు ఇంటి వచ్చి అడుగుతున్నారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యపై ఎంత శ్రద్ధ చూపుతుందో ఈ విధానం వల్ల తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

–గొర్రిపోటి వెంకటలక్ష్మి, విద్యార్థి తల్లి, పందలపాక

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావారిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. బొల్లెద్దుపాలెం, గరగలంపాలెం, రాఘవపురం, కోటికేశవరం గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఎంపీటీసీ అల్లి సింహాచలం. వైఎస్సార్ సీపీ నాయకులు పూసర్ల మహేశ్వరరావు, డేగల వెంకట్రామయ్య, ఆలయంలో బాబా విగ్రహదాత కోనా దొర, మొని రామకృష్ణ, మంగం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ చారిత్రక ప్రదేశాలను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

రాజానగరం: రాష్ట్రంలో బౌద్ధ చారిత్రక ప్రదేశాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. ఆ సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో లాలాచెరువులోని గోదావరి మహా పుష్కరవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ నేటి కాలంలో బుద్ధిజం ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. అనంతరం జిల్లాకు ఎన్నికైన నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా జంగా రాజబాబు, జనరల్ సెక్రటరీగా సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొంకి రమేష్, కోశాధికారిగా పద్మలత, ఆఫీస్ సెక్రటరీగా బాబ్జీ, సెక్రటరీలుగా చింత అనిత, జి.శ్రీనివాస్, జి.వనరాజు, కె.అరుణ్ కుమార్ బాపూజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జాలాది రవి కుమార్, వై.చక్రవర్తి, ఎస్.శివ ఎన్నికయ్యారు. వీరంతా బుద్ధిజం వ్యాప్తికి తోడ్పడతామని ప్రమాణం చేశారు. సమావేశంలో బీఎస్ఐ జాతీయ సెక్రటరీ ఎస్ఎస్ఆర్ భూపతి, రాష్ట్ర సలహాదారు చింతా శ్రీరామ్మూర్తి, రాష్ట్ర సెక్రటరీ మర్రి బాబ్జీ, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు మట్టా వెంకట్రావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు గుప్తా శ్రీరాములు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రంగంపేటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట : ఉచిత వైద్య శిబిరాల్లో వైద్యులు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. రంగంపేటలో ఎన్టీఆర్ ట్రస్ట్, శ్రీధరణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావుతో కలసి ఆయన ప్రారంభించారు. శ్రీధరణీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ టి.రామరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రోగులకు ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. పది విభాగాల వైద్యులు సుమారు వెయ్యి మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి దాదాపు రూ.లక్ష విలువైన మందులను అందజేశామన్నారు. రాజమహేంద్రవరం జీఎస్ఎన్ న్యూరో ఆసుపత్రి డాక్టర్ గోరంట్ల రవికిరణ్, కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి డాక్టర్ రేవంత్, రాజవోలు ఐ కేర్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, రాజానగరం లెనోరా, జీఎస్ఎల్, క్యాన్సర్ ఆసుపత్రుల వైద్య బృందం సేవలు అందించారు. వివిధ విభాగాల వైద్యులు వైఎస్ గురుప్రసాద్, సాయి ప్రతాప్, రేవంత్, బాల, సిబ్బంది సుబ్బారావు చౌదరి, ఆదిలక్ష్మి, జేడీ కర్ణ, ఎన్టీఆర్ ట్రస్ట్ హెల్త్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు



పులుగుర్తలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అనపర్తి: పులుగుర్తలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు కనుల పండవగా జరిగాయి. ఇందులో భాగంగా ఉభయ దేవేరులతో ఉన్న స్వామివారికి ఈ నెల 8 నుంచి ఆదివారం వరకూ విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పులుగుర్త, పరిసర గ్రామాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం విశేష పూజలతో పాటు చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ గోపురంపై శిఖరానికి వేదపండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. రాత్రి స్వామివారికి డోలోత్సవం, పవళింపు సేవలు జరిగాయి. ఈ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 14న అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడి గణపతి తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు

రంగంపేట: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నల్లమిల్లిలోని గ్లోబల్ విజన్ స్కూల్ వద్ద స్పోర్ట్స్ డేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆటలతో శారీరక దృఢత్వం పొందవచ్చన్నారు. అనంతరం కబడ్డీ, చెస్, క్యారమ్స్, వాలీబాల్ తదితర పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు స్పోర్ట్స్ అథారిటీ ఏపీ డైరెక్టర్ జి.అలేఖ్యతో కలసి బహుమతులు అందజేశారు. వైస్ ఎంపీపీ మట్లా శ్రీను, సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి సుబ్బన్న, స్కూల్ కరస్పాండెంట్ ముప్పిడి జాన్ డీన్, బిక్కవోలు చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు కేవీ ప్రసాద్, జి.చక్రవర్తి, పీవీఎస్ ప్రసాద్, హెచ్‌ఎం సత్యవాణి పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు పొందాలి



జి.మామిడాడలో ఓటు హక్కుకు దరఖాస్తు స్వీకరిస్తున్న వీఆర్వో, పక్కన తహసీల్దార్ సుభాష్

పెదపూడి: అర్హులంతా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ టి.సుభాష్ అన్నారు. ఆదివారం జి.మామిడాడలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పోలింగ్ బూత్ లెవిల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను ఆయన పరిశీలించారు. స్థానికంగా పర్యటించి ప్రజలకు ప్రత్యేక ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ప్రజలు ఓటరు కార్డుకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు. అనుసంధానం చేసుకోని వారి ఆధార్ నంబర్లు స్వీకరించారు. ఓటుకు సంబంధించిన సవరణలు, మార్పులు, చేర్పులు ఉంటే బీఎల్వోకు వివరాలు తెలియజేసి మార్చుకోవాలన్నారు. వీఆర్వో లింగం రామ్మోహన్‌రావు, సూపర్‌వైజర్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుని సన్నిధికి నడక మార్గం



వంగలపూడి వద్ద గోదావరిలో దారి ఏర్పాటు చేస్తున్న పొక్లెయిన్



రామచంద్రపురం సిద్ధి వినాయక పుష్కరఘాట్ వద్ద దారి సరిచేసే పనులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడి, రామచంద్రపురం రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే భక్తులకు ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో నడక మార్గం పనులు చేపట్టారు. వంగలపూడి రేవు నుంచి కిలోమీటరున్నర దూరంలో ఉన్న గోదావరి పాయలో నీరు అడుగున్నర మాత్రమే ఉన్నందున దారిని ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు కొంచ భాస్కరరావు, పరిమి వీర్రాజు, సూరెడ్డి పోశారావు, కోనే సుబ్బారావు, కొంచ అప్పలరాజు, రంధి శ్రీనివాస్ తదితరులు ఆదివారం నదిలో ప్రొక్లెయిన్‌తో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నపూర్ణ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న మహాశివరాత్రి సందర్భంగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి తరలివెళ్లే భక్తులకు గోదావరి పాయపై నడక మార్గం ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తుల కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం సిద్ధి వినాయక పుష్కర ఘాట్ వద్ద జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గ్రామ కమిటీ చైర్మన్ గద్దె వీరన్నబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్ కొండిపాటి కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు మద్దిపాటి రాంబాబు ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై భక్తులు తరలివెళ్లేందుకు వీలుగా ప్రొక్లెయిన్‌తో మార్గం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గోదావరిలో నీరు లేనందున నేరుగా పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి భక్తులు వెళ్లవచ్చన్నారు. మహాశివరాత్రి రోజున భక్తులకు భోజనం ఏర్పాట్లు చేస్తామన్నారు.

అదానీ ఆర్థిక మోసాలపై దర్యాప్తు చేపట్టాలి

రాజమహేంద్రవరం సిటీ: అదానీ ఆర్థిక మోసాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఆయన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నగర కన్వీనర్ అత్తిలి రాజు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం క్వారీ ఏరియాలోని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మోదీ, అదానీ నల్లధనం, ఆర్థిక ఒప్పందాలపై పార్లమెంటులో చర్చకు రాకుండా చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి తక్షణం అదానీ మోసాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యాలయాల ఎదుట ఆమ్‌ఆద్మీ పార్టీ శాంతియుతంగా నిరసన చేపట్టిందన్నారు. అదాని వంటి ఆర్థిక మోసగాడిని మోదీ ప్రభుత్వం వెనకేసుకురావడం అన్యాయమన్నారు. అలాగే గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ వద్ద నిరసన తెలిపారు. ఆ పార్టీ ప్రచార కమిటీ సెక్రటరీ వనుము శ్రీనివాసు, రూరల్ యూత్ సెక్రటరీ నాని, నగర కమిటీ సభ్యుడు జె.రాజు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుందాం..



పేదలు, వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సింహాచలం

పెదపూడి: సమాజంలో పేదలు, వృద్ధులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కాకినాడ జిల్లా పద్మశాలీల సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం అన్నారు. పెదపూడిలో ఆదివారం పప్పు సింహాచలం పుట్టిన రోజు సందర్భంగా ఆ గ్రామంలోని 150 మంది పేదలు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. అనంతరం సింహాచలం సతీమణి కల్పన అంజలీ, తల్లిదండ్రులు నాగమణి, జోగారావు, సోదరి సీతారత్నం చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మార్ని వెంకట్రావు చౌదరి, పంపన రమణ, ఇందుగపల్లి కాటయ్య, గోపీ సురేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ధవళేశ్వరం: గ్రామంలోని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం నిత్య అన్నదాన మహాయజ్ఞ దాతలు జి.జయకుమార్, జయప్రద దంపతులు వృద్ధులకు, దివ్యాంగులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ పోసికుమార్, సత్య దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ జయకుమార్, జయప్రద దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ట్రస్ట్ సభ్యులు ముత్యాల సత్య, దుర్గ పాల్గొన్నారు.

కబేళాలో 45 ఎద్దుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎద్దులు

ధవళేశ్వరం: గ్రామంలోని క్వారీ రోడ్డు కబేళాలో 45 ఎద్దులను, రెండు కళేబరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవులను వధిస్తున్నట్టు ఎస్‌పీసీఏ సభ్యులైన విజయ్‌కిషోర్, వైష్ణవ్ దినేష్ ఆదివారం ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ మంగాదేవి కబేళా వద్దకు చేరుకుని అప్పటికే వధించిన రెండు పశు కళేబరాలను గుర్తించారు. కబేళా నిర్వాహకులు అధిక సంఖ్యలో అక్కడకు చేరడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అక్కడ ఉన్న 45 ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. ఆ కళేబరాలకు పోస్టుమార్టానికి నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను మండపేట గోసంరక్షణ కేంద్రానికి తరలించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పశువులు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ఈ కలయిక.. అపురూప వేదిక



పెదపూడిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెదపూడి: పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అప్పట్లో వారికి పాఠాలు బోధించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను సత్కరించారు. పదో తరగతి చదివి నాలుగు దశాబ్ద కాలం పూర్తయిన సందర్భంగా ఈ కలయిక ఏర్పాటు చేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారు ఏపని చేస్తున్నారో, ఏ ఉద్యోగంలో స్థిరపడ్డారో తదితర వివరాలు చెప్పుకున్నారు. వారి కుటుంబాల సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తామంతా ఎక్కడ ఉన్నా ఈ పాఠశాలలో పేద విద్యార్థులకు సహకారమందిస్తామని, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు ప్రకటించారు. నిర్వాహకులు వుండవల్లి రంగారావు, అప్పసాని సోమరాజుచౌదరి, సింగినీడి నాగతిరుపతిరావు (దత్తుడు), కాకర రామచంద్రరావు, పూర్వ విద్యార్థులు పంపన వెంకటేశ్వర్లు, చీపురి గోవిందరాజులు, చుండ్రు సత్యనారాయణ, పాలచర్ల సూర్యప్రకాష్, ఆరుమిల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.